రియల్ ఎస్టేట్ కోసమే 'మూసీ'

- సుందరీకరణకు మేం వ్యతిరేకం కాదు
- మూసీ పేరుతో లూటీ జరగనివ్వం..
- హైదరాబాద్‌ను ఆగం కానియ్యం..
- బీఆర్ఎస్ హయాంలో ప్రణాళికాబద్ధంగా చేశాం
- ఢిల్లీకి మూటల కోసమే మూసీ ప్రాజెక్ట్
- బుల్డోజర్ వస్తే మేం అడ్డంగా ఉంటం..
- నాచారంలో ఎస్టీపీని సందర్శించిన కే తారకరామారావు

ఆదివారం నాచారం ఎస్టీపీని సందర్శించిన సందర్భంగా మూసీ మురికి నీటిని శుద్ధిచేసే విధానం వివరిస్తున్న కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ): రియల్ఎస్టేట్ వ్యాపారం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు చేపడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. రుణమాఫీ, రైతుబంధుతోపాటు ఆరు గ్యారెంటీల అమలుకు ప్రభుత్వం వద్ద డబ్బులు లేవు కానీ, మూసీ పునరుజ్జీవననానికి మాత్రమే డబ్బులు ఉన్నాయని ఎద్దేవా చేశారు. మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని, ఆ పేరుతో చేస్తున్న లూటిఫికేషన్‌ను అడ్డుకుంటామని స్పష్టంచేశారు. ఆదివారం ఆయన నాచారంలోని సీవరేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను బీఆరెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్ఎంటీ నగర్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ.. పదేండ్లపాటు ప్రణాళికాబద్ధంగా పనిచేసి హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దామని, వంద శాతం మూసీ నీటిని శుద్ధి చేసే దిశగా ప్రణాళికతో ముందుకు సాగామని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మూసీ మురికి నీరును శుద్ధి చేసే ప్రక్రియను వివరించారు.

బీఆర్ఎస్ హయాంలోనే మూసీ సుందరీకరణ

బీఆరెస్ హయాంలోనే మూసీ శుద్ధీకరణ, సుందరీకరణ, పునరుజ్జీవనం పథకాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టామని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి కొత్తగా చేసేదేమీ లేదని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ప్రతిరోజూ 20 కోట్ల లీటర్ల మురికినీరు ఉత్పత్తి అవుతుందని, ప్రతి చుక్క మురికినీటిని శుద్ధిచేసే దిశగా సుమారు రూ.నాలుగువేల కోట్లతో ఎస్టీపీ ప్లాంట్లు ఏర్పాటుచేశామని వివరించారు. బీఆరెస్ కట్టిన ఎస్టీపీలతోనే మురికినీరు శుద్ధి అవుతున్నదని, ఎల్బీనగర్‌లో దేశంలోనే అతిపెద్ద ఎస్టీపీ ప్లాం ట్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిరిగా తాము ఇండ్లు కూలగొట్టడం కాకుండా, మూసీకి వరద నీరు వచ్చే నాలాలను ఆధునికీకరించడం, మురికినీటిని శుద్ధి చేయడం, నదిపై కొత్త బ్రిడ్జిల నిర్మాణం, మూసీకి కొండపోచమ్మసాగర్ ద్వారా గోదావరి జలాలు తరలించడం వంటి నాలుగు అంశాలతో పక్కా ప్రణాళికతో ముందుకెళ్లామని వివరించారు. వీటన్నింటికీ కలిపి రూ.ఇరవై వేల కోట్లు కూడా ఖర్చు కాదని కానీ, రేవంత్‌రెడ్డి మాత్రం రూ.లక్షన్నర కోట్లు అవుతాయని చెప్పారని విమర్శించారు. ఇన్ని కోట్లెందుకు అని అడిగినందుకు తనపై కేసు పెట్టారని, ఢిల్లీకి మూటలు మోసేందుకే మూసీ మాటున డబ్బులు వెనకేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌ను ఆగం కానియ్యమని, పేదలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని చెప్పారు. మూసీ పేరుతో పేదల ఇండ్లపైకి బుల్డోజర్లు పంపితే మీకంటే ముందు మేమే అడ్డుంటామని కేటీఆర్ చెప్పారు.

వరంగల్ వస్త్రనగరి కల సాకారం: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): అలనాటి వరంగల్ వస్త్ర వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం చేసిన కృషి ఫలిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. నేతన్నల తలరాతలు మార్చేందుకు వరంగల్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు వేల ఎకరాల విస్తీర్ణంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు శంకుస్థాపన చేసి పట్టుదలతో పూర్తి చేసిందని, కిటెక్స్ కంపెనీ పెట్టుబడులను తీసుకొచ్చిందని వివరించారు. ఫైబర్ టూ ఫ్యాషన్ స్లోగన్‌తో వలసలు వాపస్ వచ్చేలా, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభించేలా వస్త్రనగరిని తీర్చిదిద్దడానికి చేయని ప్రయత్నాలు లేవని నాటి అనుభవాలను, అనుభూతులను ఆయన ఎక్స్‌వేదికగా గుర్తుచేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం లేకున్నా రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే ముందడుగు వేసిన నేపథ్యాన్ని వివరించారు.

రేపటి నుంచి వర్షాలు

- రాత్రి వేళలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు : వాతావరణ కేంద్రం

హైదరాబాద్, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఈ నెల 29 నుంచి మూడ్రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. పలు జిల్లాల్లో మాత్రం తేలికపాటి చిరుజల్లులు కురవొచ్చునని తెలిపింది. కొద్ది రోజులుగా రాష్ట్రంలో భిన్న వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగి ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు చలి వాతావరణం ఉంటుంది. ఖమ్మంలో 35డిగ్రీల అధిక పగటి ఉష్ణోగ్రత నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. ఇక హైదరాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రత 31డిగ్రీలు నమోదైనట్టు పేర్కొన్నారు.

తప్పిన తుపాను ముప్పు

దానా తుపాను ముప్పు ఒడిశా, పశ్చిమ బెంగాల్‌తోపాటు ఏపీ, తెలంగాణకు తప్పింది. కాగా, ఏపీలోని ఉత్తర కోస్తా, యానాం ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు అమరావతి వాతావరణ కేంద్రం అంచనా వేసింది.

ముమ్మాటికీ..కడియం రాజకీయ వ్యభిచారే

- అన్నం పెట్టిన పార్టీకి సున్నం పెట్టిండు: కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ): 'అన్నం పెట్టిన పార్టీకి సున్నం పెట్టిన కడియం శ్రీహరి ముమ్మాటికీ రాజకీయ వ్యభిచారే.. కేటీఆర్ ఆయనపై చేసిన వ్యాఖ్యలు నూటికి నూరు శాతం కరెక్టే' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టంచేశారు. ఇటీవల కేటీఆర్ పార్టీ ఫిరాయింపులపై మాట్లాడితే గుమ్మడికాయ దొంగ చందంగా కడియం శ్రీహరి స్పందించడం ఎందుకని ప్రశ్నించారు. రాజకీయాల్లో విలువల్లేని వారికి నీతులు మాట్లాడే హక్కులేదని ఆదివారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించిన ఆయన కేసీఆర్, కేటీఆర్‌పై అహంకార పూరితంగా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

కడియం.. నాలుక చీరేస్తాం!

- తిన్నింటివాసాలు లెక్కబెట్టే నువ్వా.. కేసీఆర్, కేటీఆర్ గురించి మాట్లాడేది?
- దమ్ముంటే రాజీనామా చేసి గెలువు
- తాటికొండ రాజయ్య సవాల్

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): కేసీఆర్, కేటీఆర్‌పై అడ్డగోలుగా మాట్లాడితే కడియం శ్రీహరి నాలుకను చీరేస్తామని మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య హెచ్చరించారు. 'నక్కజిత్తులమారివి, వెన్నుపోటుదారుడివి, అవకాశవాదివి, అభివృద్ధి నిరోధకుడివి, అవినీతిపరుడివి, తిన్నింటివాసాలు లెక్కబెట్టే నువ్వా.. కేసీఆర్, కేటీఆర్ గురించి మాట్లాడేది?' అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ టికెట్‌తో గెలిచిన కడియంకు దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలవాలని సవాల్ విసిరారు. తెలంగాణభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శ్రీహరికి కేసీఆర్ ఏం తక్కువ చేశారని నిలదీశారు. కడియంను కేటీఆర్ ముందు బెంచిలో కూర్చోబెడితే, కాంగ్రెస్‌లో చేరి వెనుక బెంచిలో కూర్చునే స్థాయికి వచ్చారని విమర్శించారు. ఫిరాయింపు చట్టాలపై గౌరవం ఉన్నదని కడియం మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. 1994లో రాజకీయాల్లో రాకముందు డొక్కు స్కూటర్, తెగిపోయే రబ్బరు చెప్పులు, కిటికీలకు గోనె సంచులు, గచ్చు ఇల్లు ఉన్న కడియం శ్రీహరి.. నేడు అద్దాల భవంతులు, విదేశాల్లో ఆస్తులు ఎలా సంపాదించారో చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రిగా శ్రీహరి 8% కమీషన్ తీసుకున్నారని, ఆయన బిడ్డ, ఎంపీ కావ్య, అల్లుడు నజీర్ హాంకాంగ్, సింగపూర్‌లో ఆస్తులు పోగేశారని విమర్శించారు. కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్‌కు టెక్స్‌టైల్స్ పార్క్, డిగ్రీ కళాశాల రాకుండా చేశారని, మున్సిపాలిటీ కాకుండా అడ్డుకున్నారని, దేవాదుల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పనిచేశారని దుయ్యబట్టారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బొమ్మెర రామూర్తి, కాంబోజు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి కుట్రపూరిత రాజకీయాలు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టును ఖండిస్తున్నాం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబర్ 27 : బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్టు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. రాజ్ పాకాల ఇంట్లో చేసుకున్న దావత్‌ను రేవ్ పార్టీ అని తప్పుడు ఆరోపణలు చేయడం తగదు.

వారెంట్ లేకుండా సోదాలేంటి?

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ): సెర్చ్ వారెంట్ లేకుండా కేటీఆర్, ఆయన బంధువుల ఇండ్లల్లో సోదాలు ఎలా చేస్తారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. కేటీఆర్‌ను బద్నాం చేసేందుకే సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి.. ఈ నాటకానికి తెరలేపారని మండిపడ్డారు. కేటీఆర్ బావమరిది ఇంట్లో అక్రమ మద్యం పట్టుబడితే కేసు నమోదు చేసుకోవచ్చు, కానీ భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు.

కేటీఆర్‌ను బద్నాం చేసే కుట్ర

ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

కేటీఆర్‌ను బద్నాం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. ప్రజాసమస్యలపై గళమెత్తుతున్న ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తే, కేసులు పెట్టి వేధిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

దొరికిందేమీ లేదు

బీఆర్ఎస్ లీగల్ సెల్ సభ్యుడు సోమ భరత్

రాజ్ పాకాల ఇంట్లో ఎక్సైజ్ పోలీసులు సోదాలు చేస్తే దొరికేందేమీ లేదని బీఆర్ఎస్ లీగల్ సెల్ సభ్యుడు, న్యాయవాది సోమభరత్ అన్నారు. ప్రభుత్వం పోలీసులపై ఒత్తిడి తెచ్చి బీఆర్ఎస్ నాయకుల ఇండ్లపై దాడులు చేయించడం దుర్మార్గమని మండిపడ్డారు.

ఈ ఆరాచకం ఏంటి?

బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి

'కుటుంబసభ్యులతో కలిసి ఇండ్లల్లో వేడుకలు చేసుకోవద్దా? ప్రభుత్వం ఏమైనా నిషేధించిందా? ఏంటీ ఈ ఆరాచకం' అని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి నిప్పులు చెరిగారు. కేటీఆర్, బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కొలేకే దౌర్జన్యం చేస్తుందన్నారు. కొన్ని మీడియా సంస్థలు రేవ్ పార్టీ అని బ్రేకింగ్‌లు ఇవ్వడం సమంజసం కాదన్నారు.

రేవంత్‌రెడ్డీ.. కుట్రలు మానుకో

బీఆర్ఎస్ ఎన్నారై సెల్ సభ్యుడు అనిల్ కుర్మాచలం

సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర రాజకీయాలకు తెరలేపారని అనిల్ కుర్మాచలం మండిపడ్డారు. కేటీఆర్ బంధువులు ఇంట్లో విందు చేసుకొంటే పోలీసులు రేవ్ పార్టీగా చిత్రీకరించడం దారుణమన్నారు. రాష్ట్రంలో స్వేచ్ఛగా విందులు చేసుకోలేని పరిస్థితులు దాపురించాయని మండిపడ్డారు.

రొటీన్ ప్రాసెస్‌లోనే దాడులు: మంత్రి జూపల్లి

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : ఎవరైనా ఫిర్యాదు చేస్తే స్పందించి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోదాలు చేయడం పరిపాటి అని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వాసనీయ సమాచారం అందడంతో ఎస్‌వోటీ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు విల్లాలో తనిఖీలు చేశారని తెలిపారు. రొటీన్ ప్రాసెస్‌లో భాగంగానే అధికారులు సోదాలు చేశారని, వేడుకలకు పర్మిషన్ తీసుకోలేదని, అనుమతి లేకుండా లిక్కర్ పార్టీ జరిగినట్టు అధికారులు గుర్తించారని పేర్కొన్నారు.

యాదగిరీశుడి ఆదాయాన్ని ఇక్కడే ఖర్చు చేస్తాం

- మంత్రి కొండా సురేఖ

యాదగిరిగుట్ట, అక్టోబర్ 27 : స్వామివారికి వచ్చిన డబ్బులన్నీ స్వామివారికే ఖర్చు చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారిని ఆదివారం ఆమె కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే వార్షిక బ్రహ్మోత్సవాల్లోపు స్వామివారి విమానగోపురం స్వర్ణతాపడం పనులు పూర్తి చేస్తామన్నారు. చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్ సంస్థకు 12 కిలోల బంగారం అందజేశామని తెలిపారు.

రెండు జేఏసీలున్నా సాధించింది సున్నా!

- ఉద్యోగులను, సంఘాలను లైట్ తీసుకున్న సర్కారు
- డీఏలపై మొండిచేయి చూపించిన రేవంత్ ప్రభుత్వం
- తీవ్ర ఆగ్రహంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు
- సర్కార్‌ను, సంఘాలను ఏకిపారేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): రెండు జేఏసీలున్నా.. వందలాది సంఘాలు ఒక్కతాటిపైకి వచ్చినా.. ప్రభుత్వంపై జంగ్ సైరన్ మోగించినా.. ప్రభుత్వానికి అల్టిమేటం జారీచేసినా.. కార్యాచరణ ప్రకటించినా డీఏ విడుదల సహా 50కిపైగా సమస్యలను పరిష్కరించడంలో రెండు జేఏసీలు విఫలం కావడంపై ఉద్యోగులు మండిపడుతున్నారు. శనివారం నాటి క్యాబినెట్‌లో ఒకే ఒక్క డీఏను ప్రకటించడంపై జేఏసీల పనితీరుపై, కాంగ్రెస్ సర్కార్‌పై ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెన్షనర్ల జేఏసీ ఇటీవలే ఏకంగా ఇందిరాపార్క్‌లో ధర్నా నిర్వహించింది. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం సహా ప్రభుత్వ పెద్దలెవరిని కలిసినా ఉద్యోగులకు, సంఘాలకు రిక్తహస్తమే మిగిలింది. గతంలో ఒక శాతం డీఏ కోసం 56 రోజులపాటు ఉద్యోగులు సమ్మెకు దిగిన దాఖలాలున్నాయి. కానీ ఉద్యోగ సంఘాల జేఏసీ హెచ్చరికలను రేవంత్‌రెడ్డి సర్కారు ఖాతరుచేసినట్టుగా అనిపించడంలేదు. కార్యాచరణ ప్రకటించినా లెక్కలోకి తీసుకోలేదని ప్రకటించిన ఒక్క డీఏతోనే తేలిపోయింది. ఈ విషయంలో కాంగ్రెస్ సర్కారు ఉద్యోగులు, ఉపాధ్యాయులను దారుణంగా వంచించిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీఏల విషయంలో మొండిచేయి చూపిందని వాపోతున్నారు. శనివారం నాటి క్యాబినెట్‌లో రేవంత్ సర్కారు ఒకే ఒక్క డీఏను ప్రకటించి ఉసూరుమనిపించింది. రెండు జేఏసీలున్నా.. వందలాది సంఘాలు ఒక్కతాటిపైకి వచ్చినా కనీసం పట్టించుకున్నట్టు కనిపించలేదు. పెండింగ్ డీఏలను తక్షణమే విడుదల చేస్తామని అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ హామీల మీద హామీలు గుప్పించింది. ఆ తర్వాత అదిగో డీఏ.. ఇదిగో డీఏ అంటూ దాటవేసింది. దీపావళి కానుకగా ఐదు డీఏలకు ఒకే ఒక్క డీఏపై ప్రకటన చేసి రేవంత్ సర్కార్ చేతులు దులుపుకుంది. డీఏల విడుదలపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న ఉద్యోగులు సోషల్ మీడియాలో అటు ఉద్యోగ సంఘాల నేతలు, మరోవైపు ప్రభుత్వాన్ని చెడుగుడు ఆడుకుంటున్నారు.

ఉపాధ్యాయ, ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి: యూఎస్‌పీఎస్సీ

ఐదు వాయిదాల డీఏలు పెండింగ్‌లో ఉండగా, ఒక్క డీఏను మాత్రమే విడుదల చేయడం శోచనీయం. జీవో-317 సమస్యలపై దాటవేత వైఖరిని రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగులు నిరసిస్తున్నారు. 15 రోజుల్లో మిగతా మూడు డీఏలను విడుదల చేస్తామని, పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని, సీపీఎస్‌ను రద్దుచేస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఒకే ఒక్క డీఏను విడుదల చేయడాన్ని ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రభుత్వం పెట్టాల్సిన ఖర్చులు పెడుతూనే, దుబారా చేస్తూనే ఉంది. ఉద్యోగులకు డీఏ ఇచ్చేందుకే ఆర్థిక పరిస్థితి అడ్డమొస్తుందా..? కాలయాపన లేకుండా సమస్యలన్నింటిని పరిష్కరించాలి.

ఉద్యోగులను నిరాశపరిచిన ప్రభుత్వం: ఎస్టీయూ

పెండింగ్ డీఏ మంజూరులో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులను తీవ్రంగా నిరాశపరిచిందని ఎస్టీయూ టీఎస్ ఆరోపించింది. ఐదు డీఏల్లో ఒక డీఏను మాత్రమే విడుదల చేయడంతో ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం పర్వత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జీ సదానందంగౌడ్ ప్రకటనలో పేర్కొన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పెండింగ్‌లోని అన్ని డీఏలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

సోషల్ మీడియాలో కామెంట్లు

- మూడు రంగుల జెండా పట్టి.. ఐదు డీఏలు పెండింగ్‌లో పెట్టి. జాడిచ్చి తంతున్నాడే.. మన రేవంతన్న..
- ప్రభుత్వంతో చర్చించి ఒక డీఏ ఇప్పించిన జేఏసీ నాయకులు. ప్రభుత్వం ఆర్థికంగా కష్టాల్లో ఉంది కాబట్టి ఈ డీఏను సైతం విరాళం రూపంలో ప్రభుత్వానికి రాసిమ్మంటారేమో..?
- ఇచ్చిన ఒక డీఏను సీఎం చేతుల మీదుగా అందుకోవడానికి ఎల్బీస్టేడియానికి రమ్మని పిలుపు రావొచ్చు. అంతా సిద్ధంగా ఉండండి.
- ఎల్బీస్టేడియం వద్ద పాప్‌కార్న్ అమ్ముకుంటే మన డీఏ కంటే ఎక్కువ పైసలొస్తాయి.
- ఇప్పుడొచ్చింది. డీఏ ప్రకటన మాత్రమే. జీవోలో ఎన్ని ట్విస్టులు, ఇన్‌స్టాల్‌మెంట్లు, కండిషన్లు ఉంటాయో..?
- కార్యాచరణ ప్రకటించిన జేఏసీ నేతలిప్పుడు ఎందుకు సైలెంట్ అయ్యారో. జేఏసీ దీనిని ఖండించాలి. జేఏసీ అనుసరిస్తున్న విధానాన్ని అక్కడే ఎండగడతాం.
- ప్రభుత్వానికి ఉద్యోగుల విలువ తెలియాలంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వం మద్దతు ఇచ్చిన వారిని ఘోరంగా ఓడించాలి. అప్పుడే కనీసం ఆలోచిస్తారు.
- ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పేరుతో రేవంత్‌రెడ్డి ఇచ్చింది గాడిద గుడ్డు. ఈ ఒక్క డీఏ కోసం రెండు జేఏసీలా..?
- కొండను తవ్వి ఎలుకనుపట్టాం. ఆఫ్టాల్ ఒక డీఏను సాధించి లక్షలాది మంది ఆకాంక్షలను తాకట్టుపెట్టాం. మనది గొప్ప జేఏసీ.. చరిత్రలో నిలిచిపోయే జేఏసీ.

ఒక్క డీఏ.. దీపావళి కానుకనా?

ఇది ఉద్యోగులను అవమానించడమే: ఉద్యోగ జేఏసీ మాజీ చైర్మన్ దేవిప్రసాద్

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): ఐదు డీఏల్లో ఒక్కటే ఇచ్చి ఉద్యోగులకు దీపావళి కానుక అని చెప్పుకోవడం విడ్డూరమని ఉద్యోగ జేఏసీ మాజీ చైర్మన్ దేవిప్రసాద్ విమర్శించారు. రెండు ఉద్యోగ జేఏసీలతో చర్చించిన సీఎం రేవంత్ కనీసం మూడు డీఏలు ఇస్తారని ఆశించారని, కానీ క్యాబినెట్ మీటింగ్‌లో ఒక్కటే విడుదల చేసి ఉద్యోగులను అవమానించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేవలం దీనితోనే ఉద్యోగులు సంతృప్తి చెందాలని మంత్రులు చెప్పడం హాస్యాస్పదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతేడాది డీఏ విడుదలకు అనుమతి కోసం ఈసీకి పంపించిందని ఆదివారం ఓ ప్రకటనలో గుర్తుచేశారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు అదే డీఏను ఇవ్వాలని నిర్ణయించి తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేటని ఆక్షేపించారు. అధికారంలోకి రాగానే డీఏలన్నీ విడుదల చేస్తామని, ఆరు నెలల్లో పీఆర్సీ వేస్తామని మ్యానిఫెస్టోలో చేర్చిన కాంగ్రెస్, పది నెలలు దాటుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఉద్యోగుల హెల్త్‌కార్డులు, 317, సీపీఎస్ లాంటి సమస్యలపై క్యాబినెట్ సబ్ కమిటీ వేసి చేతులు దులుపుకున్నదని దుయ్యబట్టారు. మార్చి 24 నుంచి ఇప్పటి వరకు రిటైర్డ్ అయిన ఆరు వేల మంది ఉద్యోగులకు గ్రాట్యుటీ ఎన్‌క్యాష్‌మెంట్, జీపీఎఫ్ ఇవ్వకుండా ప్రభుత్వం మానసిక క్షోభకు గురిచేస్తున్నదని ఆరోపించారు.

నకిరేకల్ ప్రభుత్వ దవాఖాన ఎదుట బాధిత కుటుంబం ధర్నా

కాంగ్రెస్ రాజకీయానికి యువకుడు బలి

- కాంగ్రెస్ సభా వేదికను ఢీకొని యువకుడి మృతి
- సభ నేపథ్యంలో మృతదేహం రోజంతా పోస్ట్‌మార్టం గదిలోనే
- నకిరేకల్‌లో అమానవీయంగా వ్యవహరించిన పోలీసులు

చరణ్ (ఫైల్)

నకిరేకల్/శాలిగౌరారం, అక్టోబర్ 27 : కాంగ్రెస్ నాయకుల అత్యుత్సాహం నల్లగొండ జిల్లాలో ఓ యువకుడి ప్రాణాలను బలి తీసుకున్నది. మూసీ ప్రక్షాళనకు మద్దతు కోరుతూ ఆదివారం తలపెట్టిన రైతు సమ్మేళనం కోసం శాలిగౌరారం మండలంలోని గురజాల-మనాయికుంట వద్ద మూసీ బ్రిడ్జిపై శనివారం రాత్రి సభా వేదికను ఏర్పాటుచేశారు. హెచ్చరిక బోర్డులు, లైట్లు లేకపోవడంతో రాత్రి 8 గంటల సమయంలో సూర్యాపేట జిల్లా కుడకుడకు చెందిన తూర్పాటి చరణ్ (17) బైక్‌పై వెళ్తూ స్టేజీని ఢీకొనడంతో మృతి చెందాడు. దాంతో రాత్రికి రాత్రి వేదికను తొలగించారు. శాలిగౌరారం పోలీసులు యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ఏరియా దవాఖానకు తరలించారు. ఆదివారం కాంగ్రెస్ సభకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం హాజరవగా, బాధిత కుటుంబం సభకు వచ్చి ఎక్కడ నిరసన తెలుపుతుందోనని పోలీసులు చరణ్ మృతదేహాన్ని నకిరేకల్ ఏరియా హాస్పిటల్‌లోని మార్చురీలో పెట్టి తాళం వేసి ఆదివారం రాత్రి వరకూ పోస్ట్‌మార్టం చేయలేదు. దాంతో బాధిత కుటుంబం దవాఖాన ఎదుట ధర్నాకు దిగింది. శనివారం రాత్రి చనిపోయిన కొడుకును ఆదివారం రాత్రి అయినా చూపించకపోవడంతో చరణ్ తల్లి గంగమ్మ తల్లడిల్లిపోయింది.

కేజీబీవీలో 60 మంది విద్యార్థినులకు అస్వస్థత

- పెద్దపల్లి దవాఖానకు తరలింపు

పెద్దపల్లి/ముత్తారం, అక్టోబర్ 27: పెద్దపల్లి జిల్లాలోని ముత్తారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో దాదాపు 60 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే వారిని పెద్దపల్లి దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పాఠశాల పరిధిలో గడ్డి మందు కొట్టించగా.. అదే గడ్డిని ఆదివారం విద్యార్థినులతో తొలగించారు. ఆ ప్రభావం వల్ల జరిగిందా? లేక ఫుడ్ పాయిజన్ జరిగిందా? అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.

అస్వస్థతకు గురైన ముత్తారం కేజీబీవీ విద్యార్థినులను పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలిస్తున్న అధికారులు

శంకర్‌రావు @ నూరేండ్లు

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన బోయిన్‌పల్లి శంకర్‌రావు ఆదివారం వంద పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా జరుపుకొన్నారు. వందేళ్ల వయస్సు వచ్చినప్పటికీ ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా, తన పనులు తానే చేసుకుంటూ, కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉంటున్నారు. కంటి అద్దాలు లేకుండానే నిత్యం దినపత్రికలు చదువుతారు. - పెగడపల్లి